క్లుప్తంగా

అందుబాటులో శనగ విత్తనాలు

ముధోల్: మండల కేంద్రంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నంద్యాల శనగ–47 అనే రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని శాస్త్రవేత్త విజయ్‌కుమార్ తెలిపారు. ఈ రకం విత్తనాలు విత్తితే యంత్రాల కోతకు పంట అనుకూలంగా ఉంటుందన్నారు. పంటకాలం 95రోజులు కాగా ఎండుతెగులను తట్టుకొని ఎత్తుగా పెరుగుతుందని వివరించారు. 25 కేజీల బ్యాగు ధర రూ.2500 ఉందని.. కావాల్సిన రైతులు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ సరఫరా ప్రారంభం


సబ్‌స్టేషన్ వద్ద ఏడీఈ రంగస్వామి, సిబ్బంది

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాను ప్రారంభించినట్లు ఏడీఈ రంగస్వామి పేర్కొన్నారు. ఇటీవల పనులు పూర్తవడంతో గురువారం రాచాపూర్ సబ్‌స్టేషన్ నుంచి గ్రామ గృహావసరాలు, వ్యవసాయం కోసం విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ మహేశ్, ఎల్‌ఎం తిరుపతి, జేఎల్‌ఎంలు రవితేజ, సిబ్బంది పాల్గొన్నారు.

నోట్‌బుక్‌లు పంపిణీ

సోన్: మండలంలోని కడ్తాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థులకు రెండేసి నోట్‌బుక్‌ల చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నల్ల పురుషోత్తంరెడ్డి, కార్యదర్శి గుమ్ముల గంగాధర్‌గౌడ్, పరమేశ్వర్, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమన్న దేవుడి గంగస్నానం


గోదావరి తీరం వద్ద భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో భీమన్న దేవుడి ఆలయ వార్షిక ఉత్సవాలు కొద్దిరోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. గురువారం స్థానిక గోదావరి తీరంలో భీమన్న దేవుని గజాలకు పుణ్యస్నాన మహోత్సవం నిర్వహించారు. శుక్రవారం జాతర నిర్వహిస్తామని.. భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

గొల్లమాడ ఏఈఓకు సన్మానం

నర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి(జి)లో రాథోడ్ అనితాబాయి అనే మహిళా రైతు ఇటీవల మరణించింది. జిల్లాలోనే తొలిసారిగా రైతు మరణించిన 24 గంటల్లోపే రైతుబీమా డెత్ స్కీన్రింగ్, డాక్యుమెంట్ అప్లోడింగ్ ప్రాసెస్ నమోదు చేసినందుకు గొల్లమాడ క్లస్టర్ ఏఈఓ చంద్యాల గణేశ్‌ను డీఏఓ అంజిప్రసాద్, టీఎన్జీఓ నాయకులు ప్రభాకర్ శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించా రు.

మంత్రి పరామర్శ

సోన్: మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో తోట సాయవ్వ(60) అనారోగ్యంతో, ఆర్మూర్ నగేశ్(19) రోడ్డు ప్రమాదంలో మరణించగా బాధిత కుటుంబాలను గురువారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, వి.సత్యనారాయణగౌడ్ పరామర్శించారు. కార్యక్రమంలో నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం


తర్లపాడ్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని తర్లపాడ్ తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జాన్సన్‌నాయక్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

పెంబి: మండలంలోని తాటిగూడలో గురువారం బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, సర్పంచ్‌లు తానాజీ, మహేందర్, నాయకులు రూప్‌సింగ్, టీకాజీ, రమేశ్, మహేందర్, ఇస్మాయిల్ ఉన్నారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలో గురువారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ సింగరి కిషన్ మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలను అందించిన బీఆర్‌ఎస్‌ను ఆదరించి జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ రాజునాయక్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఐలయ్యయాదవ్, రమేశ్‌రావ్, శివయ్య, గోపి, సుధాకర్, శంకర్, లక్ష్మిరాజం, విలాస్, రాజు తదితరులు ఉన్నారు.

ప్రమాణాలు పాటిస్తేనే ‘మద్దతు’


చామన్‌పెల్లిలో పొలం కోస్తున్న హార్వెస్టర్

లక్ష్మణచాంద: జిల్లాలో వరికోతలు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. ఇప్పటికే గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2203, సన్నరకాలు(బీ గ్రేడ్)కు రూ.2183 చెల్లించాలని నిర్ణయించింది. రైతులు సైతం తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్‌ఎం అలీ పేర్కొన్నారు. ఇప్పటికే లోకేశ్వరం, ముధోల్, లక్ష్మణచాంద మండలాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా.. త్వరలో కోతలు చేపట్టిన అన్ని చోట్ల కేంద్రాలను ఏర్పాటు చేస్తామని వివరించారు. ఈసారి బోగస్ కొనుగోళ్ల కట్టడికి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని.. రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు వచ్చేటప్పుడు తమ వెంట ఆధార్ తెచ్చుకోవాలని వారు సూచించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

1. రైతులు పూర్తిస్థాయిలో పొలం ఆరిన తర్వాతే వరికోతలు ప్రారంభించాలి.. లేకుంటే గింజలు తాలుగా మారి నష్టపోయే అవకాశం ఉంటుంది.
2. ఎకరం పొలాన్ని హార్వేస్టర్ గంట పదిహేను నిమిషాల నుంచి గంటన్నరలోగా కోయడం పూర్తి చేసేలా చూడాలి.
3. పొలం కోసేటప్పుడు యంత్రం వేగం 18 ఎం.పీ.ఆర్ ఉండేలా చూసుకోవడంతోపాటు ఫ్యాన్‌ను వేగంగా తిరగనివ్వాలి.
4. వరికోత యంత్రంలో ఉండే జల్లెడ ధాన్యాన్ని జల్లెడ పట్టేందుకు సరిపడా పరిమాణం కల్గిన రంధ్రాలు ఉండేలా చూసుకోవాలి. కోసే సమయంలో పొలంలో వేలాడే విద్యుత్ తీగలు లేకుండా చూసుకోవాలి.

కేంద్రానికి ధాన్యం తెచ్చేటప్పుడు పాటించాల్సిన నిబంధనలు..

- పొలం కోసిన తర్వాత ధాన్యంలో తప్ప, తాలు, మట్టిపెళ్లలు, రాళ్లు లేకుండా చూడాలి.
- ధాన్యం ఆరబెట్టిన తర్వాతే తేమ శాతం 17 ఉండాలి.
- ధాన్యాన్ని తూర్పార పట్టడం లేదా ఇతర ప్రక్రియ ద్వారా శుద్ధి చేసిన తర్వాతనే కేంద్రానికి తీసుకురావాలి.

రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకు పంటను అమ్ముకొని మోసపోకుండా ఈ నిబంధనలు పాటించి మద్దతు ధర పొందాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించండి


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో కోమల్‌రెడ్డి


కన్కపూర్‌లో ప్రారంభిస్తున్న తహసీల్దార్ మోతీరాం

- ఆర్డీవో కోమల్‌రెడ్డి

ముధోల్: రైతులు తమ పంటను తక్కువ ధరకు దళారులకు విక్రయించి నష్టపోకుండా.. కొనుగోలు కేంద్రాల్లోనే పంట అమ్ముకోవాలని భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో ప్రారంభించి మాట్లాడారు. వారి వెంట ఎంపీడీవో సురేశ్‌బాబు, సీఈవో సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం మండలంలో..

లోకేశ్వరం: కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ మోతీరాం అన్నారు. గురువారం మండలంలోని ధర్మోర, రాజూర, కన్కపూర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

‘ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్’


సోన్ సాకెరలో ప్రచారం చేస్తున్న మాధురి

సోన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తోందని నిర్మల్ కాంగ్రెస్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు కూతురు మాధురి అన్నారు. గురువారం మండలంలోని సాకెర గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని.. కాంగ్రెస్‌కు ఒక అవకాశం ఇచ్చి గెలిపించాలని ఓటర్లను కోరారు.

నారాయణరావ్‌కు మద్దతుగా ప్రచారం

తానూరు: ముధోల్ ఎమ్మెల్యేగా నారాయణ్‌రావ్ పటేల్‌ను గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఆపార్టీ నాయకులు మాధవ్‌రావ్ పటేల్ గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పుండలిక్, బోటేఖాన్ తదితరులున్నారు.

‘బీఎస్పీతోనే బహుజనులకు అధికారం’


సుర్జాపూర్‌లో ప్రచారం చేస్తున్న బన్సీలాల్

ఖానాపూర్: బీఎస్పీతోనే బహుజనులకు రాజ్యాధికారం సాధ్యమవుతుందని ఆ పార్టీ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి బన్సీలాల్ రాథోడ్ అన్నారు. గురువారం పట్టణంలోని పలు కాలనీలతోపాటు సుర్జాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏనుగు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ప్రచారం చేశారు. ప్రజాస్వామ్య పాలన కోసం ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రాజకీయాల్లోకి వచ్చారన్నారు. ఖానాపూర్‌లో కనీసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేదని.. విద్య, వైద్యం, వంటి సౌకర్యాలు అరకొరగా అందుతున్నాయని పేర్కొన్నారు. బాబన్న, పాల్, సాగర్, విజయ్, తిరుపతి, కల్యాణ్, భీమన్న ఉన్నారు.

బీజేపీతోనే ప్రజాసమస్యల పరిష్కారం


కుభీర్‌లో మాట్లాడుతున్న రామారావ్ పటేల్

కుభీర్: బీజేపీ అధికారంలోకి వస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని బీజేపీ ముధోల్ ఎమ్మెల్యే అభ్యర్థి రామారావ్ పటేల్ అన్నారు. గురువారం మండలంలోని దావుజీ నాయక్‌తండాలో ఆ పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లంబాడాల గురువు గంగేశ్వర్ మహారాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రామారావ్ పటేల్ మాట్లాడారు. కేంద్రం ఇచ్చిన నిధులతోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనులు చేపట్టిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తండాకు చెందిన వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరగా.. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బాసర జెడ్పీటీసీ వసంత రమేశ్, సావుల మల్లన్న, సర్పంచ్‌లు జాదవ్ సునీత, శంకర్, భీంరావ్, దత్తాత్రి, గంగాశేఖర్, గోపిచంద్, నాగేందర్ తదితరులు ఉన్నారు.

కుభీర్‌లో టీడీపీ నాయకులు బోయిడి విఠల్, మాజీ జెడ్పీటీసీ వి.మోహన్, మాజీ ఎంపీటీసీలు డి.రాందాస్, పి.గంగాధర్ నాయకులు ఎం.కిషన్, పి.బాబు బీజేపీలో చేరారు. వారికి రామారావ్ పటేల్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

భైంసారూరల్: మండలంలోని హంపోలి, బోరిగాం గ్రామాల్లో గురువారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముధోల్ ఎమ్మెల్యేగా రామారావ్‌పటేల్‌ను గెలిపించాలని కోరారు. మిర్జాపూర్ ఎంపీటీసీ రజాక్, సోలంకి భీంరావు, పండిత్, లక్ష్మణ్‌రావు, శ్యాంరావు తదితరులున్నారు.

సంక్షేమ ఫలాలు అందేలా చూస్తాం


మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: బీజేపీ అధికారంలోకి రాగానే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఆ పార్టీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సంఘం నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సంఘం సభ్యులు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులకే దళితబంధు ఇస్తున్నారని.. దీంతో అర్హులైన పేదలు నష్టపోతున్నారని మహేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మహేశ్వర్‌రెడ్డి బీజేపీ అధికారంలోకి రాగానే సంఘం సభ్యుల నిర్ణయం మేరకు పేదలకు పథకాలను అందిస్తామని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు సరికెగల గంగన్న, సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీటీసీ నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘మరోసారి మోసం చేయొద్దు’

నిర్మల్‌చైన్‌గేట్: గతంలో చేయని రుణమాఫీ.. ఎన్నికల సంఘం అనుమతి ఇస్తే చేస్తామని సీఎం కేసీఆర్ పేర్కొనడం విడ్డూరంగా ఉందని బీజేపీ నాయకులు, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. మోసపూరిత మాటలతో మరోసారి రైతులను మోసం చేయవద్దని.. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి భూ కబ్జాలు తప్ప నియోజకవర్గానికి చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు.

నేటి నుంచి ఓటరు చైతన్యయాత్ర

ఖానాపూర్: ఎన్నికల నేపథ్యంలో ప్రజలను చైతన్యపరిచేందుకు శుక్రవారం నుంచి ఖానాపూర్ నియోజకవర్గంలో జాగో తెలంగాణ, రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో ఓటర్ల చైతన్య బస్సుయాత్ర నిర్వహించనున్నట్లు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు నందిరామయ్య అన్నారు. గురువారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ యాత్రకు మాజీ న్యాయమూర్తి, ప్రజాస్వామిక వేదిక చైర్మన్ చంద్రకుమార్, విశ్రాంత కలెక్టర్ ఆకునూరి మురళి, ప్రజాస్వామిక వేదిక రాష్ట్ర కన్వీనర్ వినాయక్‌రెడ్డి, తెలంగాణ జల సాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో కార్యక్రమం నిర్వహిస్తామని.. ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

ఆలయంలో భక్తుల సందడి


పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. హారతి కార్యక్రమంలో భక్తులు పాల్గొని బాబాను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

వెంకట్ జన్మదిన వేడుకలు

దస్తురాబాద్: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దుర్గం మల్లేశ్, గోవర్ధన్, చుంచు భూమన్న, రాజేందర్, శ్రీనివాస్, దయాకర్, శంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి రాజీనామా

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మల స్వామితోపాటు మరో 20 మంది కార్యకర్తలు బీజేపీకి రాజీనామా చేశారు. రెండేళ్లుగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నా.. గుర్తింపు లేదని పేర్కొన్నారు. రాజీనామా పత్రాన్ని బీజేపీ మండలాధ్యక్షుడు కిష్టయ్యకు పంపించామని.. త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని స్వామి ఓ ప్రకటనలో తెలిపారు.

సభ విజయవంతం చేయండి

కుంటాల: భైంసాలో శుక్రవారం సీఎం కేసీ ఆర్ పాల్గొనే సభను విజయవంతం చే యాల ని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ పడకంటి ద త్తాత్రి, జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బు చ్చన్న ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

బీజేపీ నాయకుల ప్రచారం


ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఖానాపూర్: ఎమ్మెల్యేగా, ఎంపీగా, జెడ్పీ చైర్మన్‌గా రాథోడ్ రమేశ్ పని చేసిన కాలంలోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందని బీజేపీ పట్టణాధ్యక్షుడు నాయిని సంతోష్ అన్నారు. గురువారం ఖానాపూర్ పట్టణంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాథోడ్ రమేశ్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మదిరె శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, అనిల్‌రావు, కన్నయ్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కడెం ఎంపీపీ


ఎంపీపీని పార్టీలోకి ఆహ్వానిస్తున్న వెడ్మ బొజ్జు

కడెం: మండలంలోని పాతమద్దిపడగ గ్రామంలో కడెం ఎంపీపీ అలెగ్జాండర్, 200 మంది కాంగ్రెస్‌లో చేరారు. గురువారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు.. ఎంపీపీకి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ఎంపీటీసీగా గెలిచి కడెం ఎంపీపీ అయిన తర్వాత అలెగ్జాండర్ బీఆర్‌ఎస్‌లో చేరారు. కొంత కాలంగా బీఆర్‌ఎస్‌కు దూరం ఉంటున్నారు. మళ్లీ కాంగ్రెస్ కండువా కప్పుకొని సొంత గూటికి చేరారు. అంతకుముందు అల్లంపల్లి పంచాయతీలో బొజ్జు పర్యటించగా బాబానాయక్‌తండా సర్పంచ్ రంభాదేవి సైతం కాంగ్రెస్‌లో చేరారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన

- మూడు రోజుల పాటు సాగనున్న మహోత్సవాలు


ముస్తాబైన ఆలయం

కుంటాల: మండలంలోని అంబకంటితండాలో శ్రీ జగదాంబదేవి, రాంరావ్ మహరాజ్ ఆలయాన్ని ఇటీవల నిర్మించగా ఈనెల 3 నుంచి ఐదో తేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఇప్పటికే ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. శుక్రవారం ఉదయం ఏడు గంటలకు దేవతామూర్తుల ఊరేగింపు, 10 గంటలకు పుణ్యావచనం, యాగశాల సంస్కారం, రక్షాబంధనం, నవగ్రహ, వాస్తు, యోగిని, క్షేత్రపాల సర్వతోభద్ర మండల పూజా కార్యక్రమం, మధ్యాహ్నం మూడు గంటలకు అగ్నిస్థాపన, యథావిధి హోమం, జలాధివాసము, హారతి, ప్రసాద వితరణ, 4న శనివారం ఉదయం తొమ్మిది గంటలకు స్వస్తి వచనములు, మండల ఆరాధన, యంత్ర సంస్కారము, దేవతానుగ్రహ హోమం, జలాధివాసము, మధ్యాహ్నం మూడు గంటలకు చండీయాగము, ధాన్యాధివాసము, పుష్పాదివాసము, హారతి, ప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు శ్రీ దీక్ష గురు ప్రేమ్‌సింగ్ మహారాజ్ దివ్య ప్రవచనములు, 5న ఆదివారం ఉదయం ఏడు గంటలకు శాంతి పఠనం, మండల పూజ, హోమం, ఉదయం 10:55 గంటలకు దేవతామూర్తుల ప్రతిష్ఠాపన, బలిహరాణాదులు, శిఖర, ధ్వజ ప్రతిష్ఠాపన కార్యక్రమం, పూర్ణాహుతి, సంప్రోక్షణ, హారతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు తరలివచ్చి మహోత్సవాలను విజయవంతం చేయాలని సర్పంచ్ జాదవ్ శంకర్ కోరారు.

అసంక్రమణ వ్యాధులపై అవగాహన


కొండుకూర్‌లో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దస్తురాబాద్: అసంక్రమణ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి వేణుగోపాల్ అన్నారు. గురువారం మండలంలోని బుట్టాపూర్‌లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అసంక్రమణ వ్యాధులపై అవగాహన కల్పించి 30 మందికి బీపీ, డయాబెటిస్, క్యాన్సర్, గుండె వ్యాధులు, పెరాలసిస్ వంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యసిబ్బంది పల్లవి, జ్యోతి, నర్సయ్య, ఆశవర్కర్లు మంజుల, లక్ష్మి, జంగుబాయి ఉన్నారు.

గ్రామాల్లో వైద్య పరీక్షలు

కడెం: నాన్ కమ్యూకేబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ) స్క్రీనింగ్‌లో భాగంగా గురువారం మండలంలోని కొండుకూర్, మాసాయిపేట్ గ్రామల్లో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి నిర్ధారణ అయిన వారికి మందులు పంపిణీ చేశారు. ఇందులో హెల్త్ సూపర్‌వైజర్ జాదవ్ గోపాల్, ఏఎన్‌ఎం రాణి, ఎంఎల్‌హెచ్‌పీ నీరిక్షణ, ఆశవర్కర్ దేవిక తదితరులు ఉన్నారు.

లబ్ధిదారులను కేంద్రాలకు రప్పించాలి


రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీవో శ్రీమతి

ఖానాపూర్: అంగన్‌వాడీ కేంద్రాలకు లబ్ధిదారులు వచ్చేలా టీచర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామల అన్నారు. సీడీపీవో సరిత ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో మామడ మండలానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లతో నిర్వహించిన సెక్టార్ సమావేశంలో సూపర్‌వైజర్ మాట్లాడారు. కేంద్రాలకు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, మహిళలు వచ్చేలా చర్యలు చేపట్టి పోషకాహారం పంపిణీ చేయాలని అన్నారు.

ముధోల్: మండలంలోని వెంకటాపూర్, చించాల, ఎడ్‌బిడ్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సీడీపీవో శ్రీమతి సందర్శించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో స్టాక్, రికార్డులను పరిశీలించి అంగన్‌వాడీ టీచర్లకు పలు సూచనలు చేశారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

సీఎం సభకు తరలిన నాయకులు


న్యూవెల్మల్ నుంచి సభకు వెళ్తున్న కార్యకర్తలు

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలోని క్రషర్ గ్రౌండ్స్‌లో గురువారం జరిగిన సీఎం కేసీఆర్ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కొరిపెల్లి కృష్ణారెడ్డి, పార్టీ ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అడ్వాల రమేశ్, జెడ్పీటీసీ రాజేశ్వర్, నాయకులు వాహనాల్లో వెళ్లారు.

సోన్: సీఎం కేసీఆర్ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి బైక్‌లు, వివిధ వాహనాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తోట సాయన్న, రొద్ద రాజేశ్వర్, గొడుగు భూమేశ్, మల్లేశ్, నర్సింగ్‌రావు, ఖాజేందర్, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్‌కు అవస్థలు



ఖానాపూర్: ఆధార్ తీసుకొని పదేళ్లు పూర్తయిన వారందరూ తప్పనిసరిగా తమ ఆధార్‌లో వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో ఖానాపూర్‌లోని ఆధార్ కేంద్రాల వద్దకు మండల ప్రజలు పరుగులు తీస్తున్నారు. రోజుకు 30 నుంచి 40 మందికి మాత్రమే అప్‌డేట్ చేస్తుండటంతో కేంద్రాల వద్దకు తెల్లవారు జామునే వాహనాల్లో వచ్చి పడిగాపులు కాస్తున్నారు. అధికారులు చొరవ తీసుకుని ఆధార్ కేంద్రాల సంఖ్యను పెంచాలని ప్రజలు వేడుకుంటున్నారు.